నేడు మన్యం బంద్

గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ఈ బంద్‌కు విపక్షాలు, ఉద్యోగ, ప్రజా సంఘాల మద్దతు

- గిరిజన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- గిరిజన స్పెషల్ డీఎస్సీ, జీవో: 3 అంశాలే ప్రధానం



బంద్‌కు సహకరించాలని పాడేరులో వర్తకులను కోరుతున్న గిరిజన సంఘం నేతలు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

గిరిజనులకు సంబంధించిన కీలక సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మన్యం బంద్ జరగనుంది. ప్రధానంగా గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, జీవో:3 పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, మాతృ భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలని, అర్హులైన గిరిజనులందరికీ వారి సాగు భూములకు అటవీ హక్కు పత్రాలు జారీ చేయాలని, గిరిజన ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ అనుమతులను రద్దు చేయాలనే డిమాండ్‌పై ఈ బంద్‌ను చేపడుతున్నామని గిరిజన సంఘం నేతలు ప్రకటించారు.

వారం రోజులుగా ముమ్మర ప్రచారం

గిరిజన సమస్యలపై 10న తలపెట్టే బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గత వారం రోజులుగా గిరిజన సంఘం, సీపీఎం, డీఎస్సీ సాధన సమితి ఏజెన్సీలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించింది. వారపు సంతల్లో, గిరిజన పల్లెల్లోనూ బంద్ చేపట్టడానికి గల కారణాలు, ఆయా గిరిజన సమస్యల వల్ల గిరిజన సమాజానికి కలిగే నష్టాలను వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు మన్యం బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి, విజయవంతం చేయాలని గిరిజన సంఘం నేతలు కోరుతున్నారు.

విపక్షాలు, ఉద్యోగ, ప్రజా సంఘాల మద్దతు

మన్యం బంద్‌కు ఏజెన్సీలో విపక్షాలు, ఉద్యోగ, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. బీజేపీ, వైసీపీ ఈ బంద్‌పై స్పందించకపోగా, తెలుగుదేశం పార్టీ, సీపీఎం సంపూర్ణ మద్దతు తెలిపాయి. సీఐటీయూ, గిరిజన సంఘం, డీఎస్సీ సాధన సమితి ప్రతినిధులు బంద్‌ను సంపూర్ణంగా విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బంద్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

కలిసికట్టుగా...

టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు

వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ



- ఉమ్మడి విశాఖ జిల్లాలో సీట్ల సర్దుబాటుపై రకరకాల ఊహాగానాలు
- బీజేపీకి అరకులోయ ఎంపీ స్థానం
- అభ్యర్థినిగా కొత్తపల్లి గీత పేరు పరిశీలన
- అనకాపల్లి ఎంపీ సీటు కూడా ఇస్తారనే ప్రచారం
- విశాఖపట్నం సీటు అడిగిన కమలనాథులు
- ఇవ్వలేమన్న టీడీపీ అధినేత
- అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే జనసేనకు నాలుగు కేటాయింపు
- బీజేపీకి విశాఖ నార్త్?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు నిర్ణయించాయి. తాజాగా ఢిల్లీలో సీట్ల సర్దుబాటుపై చర్చలు పూర్తయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీని ఓడించడానికి మూడు పార్టీలు సమన్వయంతో పనిచేయాలని అంగీకారానికి వచ్చాయి. 2014 ఎన్నికల్లో ఎలాగైతే మూడు పార్టీలు కలిసి అధికారంలోకి వచ్చాయో ఇప్పుడు అదే పునరావృతం కావాలని బలంగా కోరుకుంటున్నాయి. మూడు పార్టీల మధ్య పొత్తు నేపథ్యంలో ఎవరెక్కడ పోటీ చేస్తారనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మూడు లోక్‌సభ స్థానాలు (విశాఖపట్నం, అనకాపల్లి, అరకు), 15 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిని ఎలా పంచుకోవాలి?...అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి.

పార్లమెంటు స్థానాలపై...

అరకులోయ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ ముందు నుంచి కోరుతోంది. గతంలో అక్కడ వైసీపీ నుంచి ఎన్నికైన కొత్తపల్లి గీత ఆ తరువాత కాలంలో ఆ పార్టీకి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆమె బీజేపీలో ఉన్నారు. ఆ స్థానం ఆమెకు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇక విశాఖపట్నం లోక్‌సభ స్థానాన్ని కూడా బీజేపీ కోరుకుంది. పార్టీ అధిష్ఠానం ఆదేశం పంపించిందని చెబుతూ రాజ్యసభ సభ్యుడు ఒకరు కొన్నాళ్లుగా ఇక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే గతంలో విశాఖపట్నం ఎంపీగా గెలిచిన దగ్గుబాటి పురందేశ్వరి విశాఖ స్థానం కోరుకుంటారని ప్రచారం జరిగినా...ఆమె మాత్రం తనకు రాజమండ్రి కేటాయించాలని అధిష్ఠానాన్ని అడిగినట్టు సమాచారం. టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన రాజ్యసభ సభ్యుల్లో రాయలసీమకు చెందిన ఒకరు విశాఖ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని కోరినట్టు కూడా ప్రచారం జరిగింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోను విశాఖపట్నం లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి ఇవ్వలేమని, గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయిన 'గీతం' అధ్యక్షులు శ్రీభరత్‌నే పోటీకి దించుతున్నామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు...బీజేపీ పెద్దలకు చెప్పేశారు. దీంతో ఉమ్మడి విశాఖలో మరో ఎంపీ స్థానం ఇవ్వాలని బీజేపీ కోరినట్టు, అలాగైతే జనసేనకు అనుకున్న అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి బదిలీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ అలా జరిగితే అనకాపల్లి నుంచి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, సీఎం రమేశ్‌ల పేర్లు పరిశీలిస్తున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే ఆ ప్రాంతంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవీఆర్) పేరు కూడా బీజేపీ అధిష్ఠానం పరిశీలనలో ఉందని ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి స్థానానికి మొదట జనసేన తరఫున నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఆయన కూడా నియోజకవర్గంలో తిరిగారు. ఎందుకనో ప్రచారం ఆపేశారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి ఎంపీ స్థానం బీజేపీకి ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే అంటున్నారు.

అసెంబ్లీ స్థానాల సర్దుబాటు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా బీజేపీతో పొత్తు కుదరక ముందే అందులో జనసేన పార్టీకి నాలుగు ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి/మాడుగుల స్థానాలు కేటాయించారు. అక్కడ అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయిపోయినట్టే. అనకాపల్లికి కొణతాల రామకృష్ణ, ఎలమంచిలికి సుందరపు విజయకుమార్, పెందుర్తి పంచకర్ల రమేశ్‌బాబు పేర్లు ఖరారయ్యాయి. విశాఖ జిల్లాకు వచ్చేసరికి దక్షిణం సీటు జనసేనకు ఇచ్చారు. అక్కడి నుంచి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటీ చేస్తారని ... మిగతా 8వ పేజీలో

పసుపు రైతు ఖుషీ

- ఎట్టకేలకు నాలుగేళ్ల తరువాత ఆశాజనకంగా ధర
- జోరుగా క్రయవిక్రయాలు



హుకుంపేటలో శనివారం సంతలో పసుపు కొనుగోలు దృశ్యం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు మన్యంలో ఈ ఏడాది పసుపు ధర ఆశాజనకంగా ఉండడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లతో పోలిస్తే ప్రస్తుత ధర గిట్టుబాటు కావడంపై రైతులు సంతోషంగా వున్నారు. నాలుగేళ్ల క్రితం కిలో రూ.120 నుంచి రూ.140 వరకు ధర ఉండే పసుపు, కొవిడ్ తరువాత నుంచి కిలో రూ.65 నుంచి రూ.70 ఉండగా, గతేడాది ఘోరంగా రూ.65లకు ధర పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. స్థానిక పసుపు విదేశాలకు ఎగుమతి కాకపోవడంతోపాటు దేశీయ మార్కెట్‌లోకి దుగ్గిరాల, ఈరోడ్‌లకు చెందిన పసుపు అధికంగా రావడంతో ఏజెన్సీ పసుపునకు గిరాకీ తగ్గిందని వర్తకులు తెలిపారు.



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా వున్న పసుపు

ఏజెన్సీ వ్యాప్తంగా సుమారుగా 20 వేల ఎకరాల్లో గిరిజనులు పసుపును సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఏజెన్సీ వారపు సంతల్లో పసుపు క్రయవిక్రయాలు మొదలవుతాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో విక్రయాలు ముగుస్తాయి. కానీ గతేడాది పసుపు కొనుగోలు చేసేవారు లేకపోవడంతో గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జోరుగా పసుపు క్రయవిక్రయాలు

ప్రస్తుతం మన్యంలో పసుపు క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ప్రస్తుతం ఏజెన్సీ వారపు సంతల్లో, పసుపు పండించే గిరిజన గ్రామాల్లో వాటి క్రయవిక్రయాల దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో భూమిలోని పసుపను తవ్వేవాళ్లు, దానిని పెద్ద పాత్రల్లో వేసి ఉడకబెట్టడడం, తరువాత ఎండ బెట్టడడం చేస్తుండగా, పూర్తిగా ఎండిన తరువాత వారపు సంతలకు తీసుకువచ్చి విక్రయించుకుంటున్నారు. అలాగే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పసుపు క్రయవిక్రయాలు జోరందుకోవడంతో రాష్ట్రంలోని పసుపు ఇతర దేశాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నది. దీంతో దేశీయ మార్కెట్‌లో పసుపు కొనుగోలుకు ట్రేడర్లు ముందుకు ... మిగతా 8వ పేజీలో

ట్రాక్టర్ బోల్తా

- ఒకరి మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

చింతపల్లి, మార్చి 9: జాతీయ రహదారి నిర్మాణానికి సామగ్రిని తరలిస్తున్న ఓ ట్రాక్టర్ అంతర్ల మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ కూలి మృతి చెందగా, మరో ఏడుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పనిచేస్తున్న కూలీలు ట్రాక్టర్‌లో విద్యుత్ స్తంభాల సామగ్రిని లోడ్ చేసుకుని పెంటపాడు నుంచి లంబసింగి తరలిస్తున్నారు. అంతర్ల మలుపు వద్ద ట్రాక్టర్ బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న శ్రీకాకుళం జిల్లా కంచెలి మండలం సాగరవనవంగం గ్రామానికి చెందిన కూలీ పత్రాసి సంతోశ్(28) సంఘటన స్థలంలో మృతి చెందాడు. ఒడిశా, బిహార్ ప్రాంతాలకు చెందిన కూలీలు సాహిల్, అన్వర్‌ఖాన్, జరీఫ్‌తోపాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యాధికారి వి.రుక్మిణి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన కూలీల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు.

చెట్ల నరికివేతపై బిగుస్తున్న ఉచ్చు

ఖర్చుకు మించి ఎక్కువ సొమ్ము డ్రా చేసిన అధికారులు

- మిగులు సొమ్ము వెనక్కి ఇవ్వకుండా తప్పించుకునే యత్నం
- చింతపల్లి రిజర్వు ఫారెస్టులో 89 చెట్ల నరికివేతపై మరోసారి విచారణ

విశాఖపట్నం/ కొయ్యూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):

ఒక తప్పును కప్పి పుచ్చుకునేందుకు మరో తప్పు చేస్తూ చింత పల్లి అటవీశాఖ డివిజన్ అధికారులు అడ్డంగా దొరికిపోయారు. చెట్ల నరికివేతకు డ్రా చేసిన నిధుల్లో మిగిలిన సొమ్ము అటవీశాఖ ఖాతాకు జమ చేయలేదు. ఈ వ్యవహారం బయటపడడంతో దాని నుంచి తప్పించుకునేందుకు అవసరం లేని చోట చెట్లను నరికివేసి మొత్తం సొమ్మంతా ఖర్చయినట్టు చూపించారు. దీనిపై ఆరోపణలు రావడంతో విశాఖ సర్కిల్ స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం విచారణ చేపట్టారు. ఇందులో అక్రమాలు వెలుగుచూశాయి. దీంతో ఈ నెల 11 నుంచి మరోసారి లోతైన విచారణకు నిర్ణయించారు.



అలైన్‌మెంట్ దాటి రిజర్వు ఫారెస్టులో భారీ వృక్షాన్ని నరికివేయడంతో మిగిలిన మొదలు

రాజమహేంద్రవరం- అరకు జాతీయరహదారి 516-ఇ నిర్మాణానికి గాను అల్లూరి సీతారామరాజు జిల్లాలో చెట్ల తొలగింపునకు జాతీయ రహదారుల విభాగం రూ.2.5 కోట్లు మంజూరు చేసింది. సాధారణంగా పనులు చేపట్టే ముందు పార్ట్ పేమెంట్ అందజేసి, కలపను డిపోనకు తరలించి కొలతలు వేసిన తరువాత ఫైనల్ పేమెంట్ ఇవ్వాలి. కానీ కృష్ణాదేవిపేట- కొయ్యూరు ప్రధాన రహదారి చింతాలమ్మఘాట్ రోడ్డు (ఏడొంపుల ఘాట్)లో చెట్ల తొలగింపునకు అధికారులు అవసరానికి మించి నిధులు డ్రా చేసేశారు. కలప డిపోలకు తరలించి, కొలతలు వేయగా నిధులు ఎక్కువ ఖర్చుచేసినట్టు గుర్తించారు. ఈ మొత్తం అటవీశాఖ ఖాతాకు తిరిగి జమచేయాలి. కానీ డబ్బు వెనక్కి ఇవ్వకుండా అధికారులు కుట్రకు తెరతీశారు. ఖర్చుచేసిన మొత్తానికి బిల్లులు పెట్టుకునేందుకు వీలుగా పెద్దవలస ఫారెస్టు రేంజ్ పరిధిలోని 30 చెట్లు, కేడీపేట రిజర్వుఫారెస్టు రేంజ్ పరిధిలో 59 చెట్లు నరికివేశారు. తమ పరిధిలో లేని రేంజ్‌లో చెట్లు కొట్టివేయడంతో ఆ రేంజ్ అధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎఫ్‌వో సోమసుందరం గత శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇందులో అవసరమైన చోట కాకుండా మరోచోట చెట్లను నరికివేసినట్టు గుర్తించారు. మరో దఫా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిగ్గు తేల్చాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న పెదవలస, కేడీపేట రేంజ్ పరిధిలో జాతీయరహదారుల విస్తరణకు గుర్తించిన అటవీశాఖకు చెందిన సుమారు 10 కిలోమీటర్ల పొడవున చెట్ల తొలగింపు ప్రక్రియను కూడా పరిశీలించాలని నిర్ణయించారు.

ఐదుకు చేరిన రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య

- అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి వద్ద బంధువుల రోదనలు



అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి వద్ద మృతుల బంధువులు

అరకులోయ, మార్చి 9: అరకులోయ మండలం మాదల పంచాయతీ దమ్మగుడ్డి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. మూడు బైక్‌లు ఢీకొనడంతో మృతులు చినలబుడు గ్రామానికి చెందిన బురిడి హరి(22), అమలకాంత్(15), లోతేరు పంచాయతీ మొంజగుడ గ్రామానికి చెందిన త్రినాథ్ (32), భార్గవ్ (5) మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా తీవ్ర గాయాలపాలైన గుబాయి సింహాద్రి (29)ని కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఎస్.కోట ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించి, తీవ్ర గాయాలతో ఉన్న కొంతలి మోహన్ రావును కేజీహెచ్‌కి తరలించారు. శనివారం ఉదయం ఎస్.కోట నుంచి సింహాద్రి మృతదేహాన్ని అరకులోయకు తీసుకువచ్చి మొత్తం ఐదు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి మధ్యాహ్నం బంధువులకు అప్పగించారు. మృతుల్లో లోతేరు పంచాయతీ గానుగవలసకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన గుబాయి త్రినాథ్, భార్గవ్, సింహాద్రి ఉన్నారు. కాగా శనివారం ఉదయం అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకున్న మృతుల కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

పలువురి పరామర్శ

అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి శనివారం పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులను పరామర్శించిన వారిలో టీడీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి దొన్నుదొర, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర వున్నారు.

అశ్రునయనాలతో బోడిదొర అంత్యక్రియలు

తరలి వచ్చిన వివిధ రాజకీయ పార్టీలు, గిరిజన సంఘాల నాయకులు

కొయ్యూరు, మార్చి 9: స్వాతంత్ర్య సమరయోధులు, అల్లూరి సీతారామరాజు ప్రధాన అనుచరుడైన గాం గంటం దొర వారసుడు గాం బోడిదొర అంత్యక్రియలు శనివారం ఉదయం పలు రాజకీయ పార్టీల నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధుల సమక్షంలో జరిగాయి. బట్టపణుకుల పంచాయతీ లంకవీధి గ్రామాన్ని ఆనుకుని ఉన్న బోడిదొర సొంత వ్యవసాయ భూమిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అస్వస్థతకు గురైన ఆయన శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు, గిరిజన సంఘాలు, అల్లూరి యువజన సంఘం, క్షత్రీయ సేవా సంఘం సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి భారీగా గిరిజనులు లంకవీధి చేరుకున్నారు. బోడిదొర పార్థివ దేహానికి నివాళులర్పించి కన్నీటి పర్యంతమయ్యారు. బోడిదొరకు క్రైస్తవ ఆచారంలో అంత్యక్రియలు నిర్వహించారు. బోడిదొర కుటుంబ సభ్యులను పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కొయ్యూరు ఎంపీపీ రమేశ్‌బాబు, అల్లూరి యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, టీడీపీ నేత కె.సుబ్బారావు, తదితరులు పరామర్శించి ఓదార్చారు.



బోడిదొర పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



బోడిదొర(ఫైల్ ఫొటో)

సిట్టింగ్‌లకు లైన్ క్లియర్

సమన్వయకర్తలకు కూడా...

- ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సమావేశంలో వైసీపీ అధిష్ఠానం సంకేతాలు
- చివరి నిమిషంలో ఒకటి, రెండు మార్పులు ఉండవచ్చునంటున్న నేతలు



విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ తరఫున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులెవరనే దానిపై అధిష్ఠానం స్పష్టత ఇచ్చిందని పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్రలోని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో తాడేపల్లిలో పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో తూర్పు నియోజకవర్గం నుంచి సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, 'నార్త్' నుంచి కేకే రాజు, పశ్చిమ నియోజకవర్గం నుంచి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, అనకాపల్లి నుంచి మలసాల భరత్‌కుమార్ ... మిగతా 8వ పేజీలో

61 మంది కాంట్రాక్టు టీచర్లు రెగ్యులర్

- కలెక్టర్ ఉత్తర్వులు జారీ

పాడేరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ విద్యాశాఖలో పని చేస్తున్న 61 మంది కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లను రెగ్యులర్ చేస్తూ కలెక్టర్ విజయసునీత శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేయాలని ఈ నెల ఏడో తేదీన రాష్ట్ర ప్రభుత్వం జీవో:10ను జారీ చేసింది. ఆ జీవో మేరకు ఏజెన్సీలో అర్హులైన 61 మంది కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేస్తూ కలెక్టర్ విజయసునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను శనివారం రాత్రి కాంట్రాక్టు టీచర్లకు ఆమె అందజేశారు.



సీఆర్‌టీలను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు అందిస్తున్న కలెక్టర్

భక్తజన తోవ.. కల్యాణపులోవ

రెండో రోజు పోతురాజుబాబు దర్శనానికి పోటెత్తిన జనం

- శివరాత్రి జాగారం అనంతరం భారీగా తరలి రాక
- శివనామ స్మరణతో మార్మోగిన పరిసరాలు
- బస్సుల వద్ద తొక్కిసలాట.. పిల్లలు, వృద్ధులు విలవిల
- ట్రాఫిక్‌ను వన్‌వే చేయడంతో కాసేపు ఇబ్బందులు

రావికమతం, మార్చి 9: కల్యాణపులోవ శనివారం కిటకిటలాడింది. మహా శివ రాత్రి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్న వారంతా రాత్రి జాగరణ అనంతరం సముద్రాలు, జలాశయాలు, చెరువుల్లో పవిత్ర స్నానాలు ఆచరిస్తుండడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మండలంలోని కల్యాణపులోవకు అతి భారీగా తరలి వచారు. తిరునాళ్ల రెండో రోజు వేకువజాము నుంచి ఎటుచూసినా జనసందోహమే కనిపించింది. తొలిరోజు శుక్రవారం ఈ ఏడాది ఆశించిన స్థాయిలో భక్తులు రాలేదు. అయితే మర్నాడు తిరునాళ్ల ప్రాంతాలు కిక్కిరిసిపోయి కనిపించారు. దీంతో ఆయా ప్రాంతాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఇక్కడి రిజర్వాయర్‌లో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం అంతా క్యూలో నిలిచి పోతురాజుబాబు, పెద్దింటమ్మవార్లను దర్శించుకున్నారు. కొందరు దంపతులు నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని పురోహితులతో బ్రహ్మ ముడులు వేసుకుని ఆపై దర్శనాలకు వెళ్లారు. మొదటి రోజు ఆశించిన స్థాయిలో భక్తులు లేరని భావించిన ఆర్టీసీ అధికారులు రెండో రోజు వాటి సంఖ్యను లోవకు తగ్గించారు. దీంతో బస్సులు చాలక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సుల వద్ద తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. పిల్లలు, వృద్ధులు విలవిల్లాడారు. ఇదిలావుంటే, కల్యాణపులోవ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించకుండా కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను వన్ వే చేశారు. దీంతో ఉదయం పదకొండు నుంచి పన్నెండు గంటల మధ్య ములకలాపల్లి- కల్యాణపులోవ మధ్యలో కొంత సమయం ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే బస్సులు, కార్లు మినహా, బైక్‌ల తిరుగు ప్రయాణం రూట్‌ను రిజర్వాయర్ కాలు గట్టుకు పోలీసులు మళ్లించి టి.అర్జాపురం శాస్త్రి మామిడి తోట వద్ద నుంచి బీఎన్ రోడ్డులోకి చేరేలా చేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది. వివిధ శాఖలకు చెందిన సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సేవలో తరించారు.


పోతురాజుబాబును దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే రాజు


భక్తులతో కిక్కిరిసిన రిజర్వాయర్ గట్టు ప్రాంగణం


బస్సు ఎక్కేందుకు భక్తుల అవస్థలు



వెంకటాపురంలో కూలిన సన్‌షేడ్

» నాయనమ్మ, మనవడికి గాయాలు



కూలిన సన్‌షేడ్ (అంతర్ చిత్రం) గాయపడిన బాలుడు సోహన్‌రవికుమార్, వరహాలమ్మ

ఎస్.రాయవరం, మార్చి 9: మండలంలోని వెంకటాపురంలో శనివారం ఒక ఇంటి సన్‌షేడ్ కూలి పోయిన ఘటనలో ఇద్దరికి గాయా లయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వెంకటాపురంలో మరిసా విజయకుమార్, తన తల్లి, భార్య, ఇద్దరి పిల్లలతో శ్లాబ్ ఇంటిలో నివాసముంటున్నాడు. శనివారం తల్లి వరహాలమ్మ, మనవడు సోహన్ రవికుమార్(6) సన్‌షేడ్ కింద కూర్చున్నారు. అదే సమయంలో శ్లాబ్ సన్‌షేడ్ వారి పక్కనే కూలిపోయింది. దీంతో నాయనమ్మ, మనవడికి గాయాలయ్యాయి. గాయపడిన వారిద్దరిని తుని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు. అదృష్టం బాగుండి వారి పక్క సన్‌షేడ్ కూలిందని, వారిపై పడితే ప్రాణాలు కోల్పోయి ఉండే వారని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో మిగిలిన కుటుంబ సభ్యులు ఇంటిలోనే ఉన్నారు. వారంతా క్షేమంగా ఉన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

సబ్బవరం, మార్చి 9: మండలంలోని ఇరువాడలో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న నలుగురుపై కేసు నమోదు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. ఇరువాడలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేయగా.. నలుగురు యువకులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.20,360 నగదును స్వాధీనం చేసుకొని శనివారం కోర్టుకు తరలించినట్టు సీఐ రమణ తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా విద్యా శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ


వెంకన్నను దర్శించుకుంటున్న వెంకటలక్ష్మమ్మ

నక్కపల్లి, మార్చి 9 : జిల్లాలో టెన్త్ పరీక్షలకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని డీఈవో వెంకట లక్ష్మమ్మ చెప్పారు. శనివారం ఉదయం ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గోత్ర నామాలతో అర్చకులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి 29వ తేదీ వరకూ టెన్త్ పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో 21,756 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. ఇదిలావుంటే, వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘమాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారికి అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం చేసి భక్తులకు దర్శనాలకు అనుమతించారు. కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులు,క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు,భాగవతం సాయిగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి బి.గీతిక స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి టీడీపీ కార్యకర్తల ఆందోళన

- సీటు జనసేనకు కేటాయించడంపై అభ్యంతరం
- రెండు, మూడు రోజుల్లో పార్టీ అధినేతను కలుస్తామని సర్దిచెప్పిన నేతలు
- టీడీపీకే కేటాయించాలంటూ తీర్మానం
- అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యమన్న పార్టీ ఇన్‌చార్జి 'ప్రగడ'


సమావేశంలో నిరసన వ్యక్తంచేస్తున్న కార్యకర్తలు

ఎలమంచిలి, మార్చి 9 : జిల్లాలోని ఎలమంచిలి సీటు జనసేనకు ఇవ్వడం పట్ల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ మంత్రి, సీనియర్ నేతల పప్పల చలపతిరావు, తదితరులు వారిని శాంతింపజేశారు. పొత్తులో భాగంగా ఎలమంచిలి టికెట్ జనసేనకు ఇస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో శనివారం పట్టణంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నుంచి తనకు, పెద్దలు పప్పల చలపతిరావుకు ఫోన్ వచ్చిందని, పొత్తులో భాగంగా ఎలమంచిలి సీటు జనసేనకు కేటాయించినట్టు తెలిపారన్నారు. స్థానిక పరిస్థితులను చంద్రబాబుకు వివరించామని, అయితే అధిష్ఠానం నిర్ణయమే తనకు శిరోధార్యమని ప్రగడ అన్నారు. అనంతరం మాజీ మంత్రి పప్పల చలపతిరావు మాట్లాడుతుండగా గెలిచే సీటును ఎందుకు వదిలేశారంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తూ పోడియం వద్దకు వచ్చేందుకు యత్నించారు. ఈ సమయంలో కొందరు కుర్చీలు విసిరేశారు. ఎలమంచిలి సీటు టీడీపీకే కేటాయించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రగడ వారిని శాంతింపజేసేందుకు యత్నించారు. నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరారు. అనంతరం ఆడారి మంజు, రాజాన నారాయణమ్మ, దూలి రంగనాయకులు, గొర్లె నానాజీ తదితర నేతలు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లపాటు పార్టీ కోసం శ్రమించిన ప్రగడకు టికెట్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం తరువాత తొమ్మిదిసార్లు ఎన్నికలు జరగ్గా.. ఆరుసార్లు పార్టీ అభ్యర్థి విజయం సాధించినట్టు తెలిపారు. పార్టీకి ఎనలేని పట్టు ఉన్న నియోజకవర్గం గురించి అధిష్ఠానానికి మరోమారు తెలియపరుస్తామన్నారు. రెండు రోజుల్లో చంద్రబాబునాయుడు కలుస్తామని, కార్యకర్తలంతా సంయమనంతో ఉండాలని కోరారు. అనంతరం ఎలమంచిలి సీటు టీడీపీకు కేటాయించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

» రూ.2.36 లక్షల కోట్లు బటన్ నొక్కుడు సరే.. మిగిలిన రూ.పది లక్షల కోట్లు ఏమయ్యాయి?

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత రూ.12 లక్షల కోట్లు పైబడి అప్పులు తెచ్చారని, ఈ మొత్తంలో ఇప్పటివరకు సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.2.36 లక్షల కోట్లు బటన్ నొక్కి పంపిణీ చేశామని జగన్ రెడ్డి చెబుతున్నారని, మిగిలిన రూ.10 లక్షల కోట్లు దేనికి ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి తనను తాను దైవ సంభూతుడిగా, పెత్తందారుగా ఊహించుకుంటున్నారని విమర్శించారు. సంక్షేమానికి వారధినని చెప్పుకునే జగన్ వలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులు, పాస్టర్లకు, తుదకు ఓటర్లకు సైతం ప్యాంట్లు, చొక్కాలు, చీరలు, కుక్కర్లు, సెల్‌ఫోన్లు, టీ కప్పులు ఇలాంటి చిల్లర తాయిలాలతో ఎరవేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు జగన్‌పై నమ్మకం లేదుకాబట్టే తాయిలాలు ఇవ్వడం మొదలు పెట్టి ఓట్ల కోసం ఎరవేస్తున్నారన్నారు. ఓట్లు వచ్చే మార్గం ఎన్నుకోవడం వలనే ఒక రాజధాని నిర్మించడం, రోడ్లు వేయడం, ఫ్యాక్టరీలు కట్టడం అనవసరమని, అవి ఓట్లు తెచ్చేవికాదన్న భావంతో జగన్‌రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రం కోలుకోలేని విధంగా అప్పులు చేసి, కేవలం పంచడం కోసమే ప్రభుత్వం ఉందన్న భావనను ప్రజల్లోకి తీసుకెళ్లారని విమర్శించారు. సంపద సృష్టించడం చేతకాక అభివృద్ధిని గాలికి వదిలేస్తే ప్రజలు ఉప్పెనలా ఎగిసిపడి వైసీపీని సమాధి చేస్తారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కడిమిశెట్టి నరసింగరావు, కె.జగన్, బి.వెంకటరావు, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

కేడర్ సంయమనం కోల్పోవద్దు

రాష్ట్రంలో వైసీపీ పాలన అంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకుంటున్నాయని జగదీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి అధినేతలు టికెట్‌ల కేటాయింపులు, మార్పు చేర్పుల విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా కేడర్ ఏ ఒక్కరూ సంయమనం కోల్పోయి వ్యవహరించరాదన్నారు. అధినేత చంద్రబాబును సీఎం చేయడమే అందరి లక్ష్యంగా పనిచేయాలని బుద్ద కోరారు.

ఇంటర్ పరీక్షలకు 13,770 మంది హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 9: జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం మాథ్స్-1బి, జువాలజీ-1, హిస్టరీ-1 పరీక్షకు 13,770 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్‌బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 14,313 మందికి 542 మంది హాజరు కాకపోవడంతో 13,770 మంది పరీక్షలకు హాజరయ్యారని వివరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం

- అందరి లక్ష్యం ఇదే కావాలి
- ఆర్‌పీఎఫ్ బలగాలతో ఎస్పీ మురళీకృష్ణ


కేంద్ర బలగాలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

చోడవరం, మార్చి 9: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. అనకాపల్లి జిల్లాకు కేటాయించిన బీహార్ ఆర్‌పీఎఫ్ బలగాలకు పట్టణంలోని చీడికాడ రోడ్డులో గల చైతన్య బీఈడీ కళాశాల వద్ద వసతి సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం ఇక్కడికి విచ్చేసిన ఎస్పీ కేంద్ర బలగాలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధిద్దామన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడంతో పాటు, వాహన తనిఖీలు, పెట్రోలింగ్ తదితర విధులన్నీ ఎన్నికలయ్యేంత వరకూ కేంద్ర బలగాలు నిర్వహిస్తాయన్నారు. కేంద్ర బలగాల అవసరాల కోసం ప్రత్యేకంగా లైజనింగ్ ఆఫీసర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. అనంతరం జిల్లాలో పరిస్థితులపై కేంద్ర బలగాలకు ఎస్పీ అవగాహన కల్పించారు. అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, డీఎస్పీ ఎస్.అప్పలరాజు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌పీఎఫ్ కమాండర్ జగదీశ్‌రాజ్, చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే మెదడు, వెన్నెముక లోపాల నివారణ

» ఫోలిక్ యాసిడ్ పోర్టిఫైడ్ అయోడైజ్డ్ సాల్ట్ వినియోగంతో సాధ్యం

» ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చడానికి ముందు నుంచీ మహిళలు ఫోలిక్ యాసిడ్ పోర్టిఫైడ్ అయోడైజ్డ్ సాల్ట్ వినియోగించినట్టయితే పుట్టుకతో చిన్నారుల్లో కనిపించే మెదడు, వెన్నెముక లోపాలను నివారించవచ్చునని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. ఈ విషయం తమ వైద్య బృందం చేసిన పరిశోధనలో తేలిందన్నారు. శనివారం ఉదయం ఆంధ్ర మెడి కల్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పరిశోధన వివరాలను ఆయన వెల్లడించారు. మెడి కల్ కళాశాల పరిధిలోని న్యూరోసర్జరీ విభా గానికి చెందిన బృందం, జాతీయ, అంతర్జాతీయ వైద్యు లతో కలిసి పుట్టుకతో వచ్చే మెదడు, వెన్ను అవ కారాలపై పరిశోధన సాగించిందన్నారు. గర్భం దాల్చడానికి కొద్దిరోజుల ముందే మహిళలకు ఫోలిక్ యాసిడ్ కలిపిన పోర్టిఫైడ్ సాల్ట్ ఇవ్వడం ద్వారా అతరహా సమస్యలకు చెక్ చెప్పవ చ్చునని తేలిందన్నారు. ఈ విషయం జర్నల్ ఆఫ్ అమెరి కన్ మెడికల్ అసోసియేషన్ నెట్‌వర్క్ ఓపెన్ అనే పబ్లికేషన్ ప్రచురించిందన్నారు. ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల శిశువుల్లో నాడీ సంబంధమైన సమస్యలు ఉత్పన్నం కావడంతోపాటు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ పరిశోధనను అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు గ్రామాల్లో 1,200 మంది మహిళలపై సాగించినట్టు తెలిపారు. నాలుగు నెలలపాటు ఫోలిక్ యాసిడ్ పోర్టి ఫైడ్ అయోడైజ్డ్ సాల్ట్‌ను వారికి అందించడం జరిగిందన్నారు. ఈ ఉప్పు తీసుకున్న వారిలో ఫోలిక్ యాసిడ్ స్థాయిలు రక్తంలో గణనీయంగా పెరిగా యని, దీనివల్ల ఆయా వ్యాధుల ప్రమాదం తగ్గిం దన్నారు. ఈ అధ్యయనం దేశ, విదేశాల నుంచి వచ్చిన నిపుణుల బృందం డాక్టర్ ఎంవీ విజయ శేఖర్, డాక్టర్ బి.హయగ్రీవరావు, ఫణి మాధవి, అనిల్‌కుమార్, యూఎస్‌ఏ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ జోగి వి పట్టిసాపు, ఎమోరీ విశ్వవిద్యాలయం డాక్టర్ గాడ్ పీవోకే, విజయ కంచర్ల ఆధ్వర్యంలో సాగిందన్నారు. సమావేశంలో డాక్టర్ విజయశేఖర్, ప్రాజెక్ట్ సమన్వయకర్త కె.మధునారాయణరావు (అనిల్) పాల్గొన్నారు.

ఆహ్వానపు వాలీబాల్ పోటీల విజేత గాజువాక


మొదటి బహుమతి విజేత గాజువాక సభ్యులకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, మార్చి 9 : స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో రెండు రోజులుపాటు జరిగిన ఉత్త రాంధ్ర స్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలు శుక్రవారం అర్ధరాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో గాజువాక జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. వీరికి రూ. 15వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న ఆదిరెడ్డిపాలెం జట్టుకు రూ.10 వేలు, తృతీయస్థానం దక్కించుకున్న అనకాపల్లి జట్టుకు రూ.ఆరు వేలు, జ్ఞాపికను నిర్వాహకులు యల్లపు గోవింద, పీలా రమణారావు, బుద్ద శివ, భీమరశెట్టి లక్ష్మీనారాయణ అందజేశారు. ముగింపు కార్యక్రమానికి ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ హాజరై వాలీబాల్ నిర్వహణ కమిటీ కన్వీనర్ యల్లపు గోవింద్‌ను సత్కరించారు. అలాగే వ్యక్తిగత బహుమతులను గౌరీ వ్యాయామశాల అధ్యక్షుడు కొణతాల అప్పలనాయుడు క్రీడాకారులకు అందజేశారు. ఈ ఏడాదిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని రఘునాథ్ చెప్పారు. పోటీల నిర్వాహకులు విల్లూరి ప్రసాద్, పెంటకోట చిన్న, దాడి ఈశ్వరరావు, భీశెట్టి శ్రీనివాసరావు, రాపేటి సీతారాం, రిఫరీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. సౌకర్యాలు కొరవడి!



ఈ రేకుల షెడ్డులోనే పెదఅగ్రహారం పాఠశాల నిర్వహిస్తున్నది..!

మట్టి గోడలతో శిథిలమైన షెడ్డులోనే ప్రభుత్వ పాఠశాల

అది కూడా పెదఅగ్రహారం గ్రామస్థులు నిర్మించిందే..

భవనం నిర్మించాలని కోరుతున్నా పట్టని వైసీపీ పాలకులు

నేలపై కూర్చొని బిక్కుబిక్కుమంటూ విద్యార్థుల చదువులు

గూడెంకొత్తవీధి, మార్చి 9: 'విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. కోట్లాది రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నాం' అంటూ ఊదరగొడుతున్న వైసీపీ పాలకులు తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పట్టించుకోవడం లేదని గూడెంకొత్తవీధి మండలం పెదఅగ్రహారం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గూడెంకొత్తవీధి మండలంలోని పెదఅగ్రహారం గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో పెదఅగ్రహారం గ్రామానికి చెందిన 26 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్నారు. అయితే ఈ గ్రామంలో పాఠశాల భవనం లేదు. దీంతో స్థానిక గిరి జనులు శ్రమదానం చేసి మట్టి గోడలతో ఓ షెడ్డును నిర్మించారు. ఆ షెడ్డు కూడా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలకు భవనం నిర్మించకపోవడం.. ఎటువంటి గత్యంతరం లేకపోవడం వెరసి ఈ షెడ్డులోనే విద్యార్థులు నేలపై కూర్చొని చదువుకుంటున్నారు. వర్షం కురిస్తే ఈ షెడ్డు కారిపోతుంది. దీంతో గ్రామంలోని ఇళ్ల వరండాల్లో ఉపాధ్యాయిని పాఠాలు చెబుతున్నారు. విద్యార్థుల అవస్థలను పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుకు వెళ్లినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శిథిలమైన రేకుల షెడ్డులో నేలపై కూర్చొన్న పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

వైభవంగా మహా రుద్రాభిషేకం

పాడేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహారుద్రాభిషేకం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా ఈక్రతువును ప్రత్యేకంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమైన మహా రుద్రాభిషేకం శనివారం తెల్లవారు జామున మూడు గంటలకు ముగిసింది. పన్నెండు రకాల పదార్థాలతో శివలింగానికి ప్రధాన అర్చకులు శ్రీరామ్, సహాయ అర్చకులు ఎస్.రాము, శివ, తదితరులు అభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

» **భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు**

పాడేరు రూరల్, మార్చి 9: జిల్లా కేంద్రం పాడేరులోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినం కావడంతో శివాలయాలతో పాటు మోదకొండమ్మ, శిరిడీసాయి, కనకదుర్గమ్మ ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం రాత్రి నుంచి తెల్లవార్లు శివరాత్రి జాగరాలను చేపట్టిన భక్తులు, శనివారం భక్తిశ్రద్ధలతో స్నానమాచరించి ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శివాలయాలకు వచ్చి శివ దర్శనాలు చేసుకున్నారు. అలాగే మఠంలో ప్రసిద్ధి గాంచిన మత్స్యలింగేశ్వరుని ఆలయానికి వందలాది మంది భక్తులు తరలివెళ్లారు. ఉమానీలకంఠేశ్వరుని ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు పర్యవేక్షణలో ప్రసాద కమిటీ ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక బృంద, ప్రసాద కమిటీ సభ్యులు కొట్టగుళ్లి రామారావు, ఉప్పల వెంకటరత్నం, కొట్టగుళ్లి పోతురాజు, సిద్దినాతి కొండలరావు, బీవీఎస్.ముకుందరావు, శివరాత్రి శ్రీనివాసకుమార్, డి.బాబూరావు, వంతినభ రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.





ఉమానీలకంఠేశ్వరుని దర్శనానికి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు... పూజలు చేస్తున్న అర్చకులు

మన్యం బంద్‌కు టీడీపీ సంపూర్ణ మద్దతు

» **పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్**



అరకులోయ, మార్చి 9: పలు డిమాండ్ల సాధనకు మన్యంలో ఆదివారం తలపెట్టిన బంద్‌కు టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్నింటా గిరిజనులకు అన్యాయమే జరుగుతుందన్నారు. గిరిజనుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 17 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. నవరత్నాలు పేరు చెప్పి అరకొరగా పథకాలను అదిస్తున్నారని, అది కూడా రెండో ఏడాదికి ఏదో మెలిక పెట్టి అర్హుల జాబితా నుంచి తొలగించి లక్షాలాది మంది లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించడమే లక్ష్యంగా అందరూ పని చేయాలని కోరారు.

చింతపల్లిలో బాబు ష్యూరిటీ కార్యక్రమం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చింతపల్లి, మార్చి 9: మండల కేంద్రంలో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత రీమల ఆనందరావు ఆధ్వర్యంలో గూణలంక, రామాలయం వీధుల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను వివించారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆదివాసీల కోసం ప్రత్యేకంగా పథకం ప్రవేశపెట్టింది లేదని, సరికదా టీడీపీ ప్రవేశపెట్టిన 15 రకాల పథకాలను రద్దు చేశారని ఈ సందర్భంగా ఆనందరావు ఆరోపించారు. ప్రస్తుతం గ్రామాల్లో కనీస సదుపాయాలు లేక ఆదివాసీలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాంగి రాము, సరమండ శ్రీధర్, రీమల ఝాన్సీ, జర్రా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నష్టపరిహారం పెంచాలని రైతుల వినతి



సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

పాడేరు రూరల్, మార్చి 9: జిల్లా కేంద్రం పాడేరులో చేపట్టనున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భూములను కోల్పోయిన రైతులకు అందించే నష్టపరిహారాన్ని పెంచాలని కోరారు. ఈ మేరకు సుండ్రుపుట్టు, సేరుబయలు రైతులు శనివారం సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందించారు. జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ విచారణ కోసం కిండంగి పంచాయతీ కేంద్రానికి చేరుకున్న సబ్ కలెక్టర్‌ను రెండు గ్రామాల రైతులు దన్నేటిపలాని సురేష్‌కుమార్, జవ్వాది బాబూరావు, బుక్కా జగదీష్, వి.రఘుబాబు తదితరులు కలిసి పరిహారం పెంచాలని విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు.

వారపు సంతలో బుడియాల సందడి

ముంచంగిపుట్టు, మార్చి 9: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో బుడియాలు (గంగమ్మ తల్లి భక్తులు) సందడి చేశారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న ఉత్సవాల సందర్భంగా బుడియా మాలధారణ చేసిన భక్తులు వివిధ రకాల వేషధారణలతో సంతలో కలియతిరుగుతూ విన్యాసాలు, నృత్యాలతో సందడి చేశారు. అలాగే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గంగమ్మతల్లి ఉత్సవాలపై విస్తృత ప్రచారం చేపట్టారు. ఉత్సవాల పోస్టర్‌ను, గంగమ్మతల్లి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మొదటి రోజు రాత్రి జాతర ఉంటుందని, రెండో రోజు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచే వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.రమేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎస్.శంకరావు, కార్యదర్శి వి.నీలకంఠం పాల్గొన్నారు.



వివిధ వేషధారణల్లో సందడి చేస్తున్న బుడియాలు

ఆఫ్‌లైన్‌లో రేషన్ సరకులు పంపిణీ చేయాలి

గూడెంకొత్తవీధి, మార్చి 9: సెల్ సిగ్నల్స్ లేని గ్రామాల గిరిజనులకు ఆఫ్‌లైన్‌లో రేషన్ సరకులు పంపిణీ చేయాలని గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. గాలికొండ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల గిరిజనులు రేషన్ పొందేందుకు ఎదుర్కొంటున్న సమస్యలను శనివారం సర్పంచ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అధిక గ్రామాలకు సెల్ సిగ్నల్స్ లేవన్నారు. దీంతో రేషన్ సరకులు పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్ సిగ్నల్స్ అందే ప్రాంతానికి వాహనం తీసుకొచ్చి సరకులను పంపిణీ చేస్తున్నాడన్నారు. దీంతో ఆదివాసీలకు సరకులు మోత భారం తప్పడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆఫ్‌లైన్‌లో పంపిణీ చేసే వెసులుబాటు కల్పిస్తే ఈ సమస్య తప్పుతుందని ఆయన పేర్కొన్నారు.



రేషన్ సరకులు అందలేదని పంచాయతీ కేంద్రానికి వచ్చిన గిరిజనులు

సిట్టింగ్‌లకు లైన్‌క్లియర్

... 5వ పేజీ తరువాయి

, పాడేరు నియోజకవర్గం నుంచి సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరరాజు, అరకులోయ నుంచి సమన్వయకర్త రేగం మత్స్యలింగంతోపాటు మిగిలిన నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలే (భీమిలి- ముత్తంశెట్టి శ్రీనివాసరావు, 'సౌత్'- వాసుపల్లి గణేష్‌కుమార్, ఎలమంచిలి- కన్నబాబురాజు, నర్సీపట్నం-పెట్ల ఉమాశంకర్‌గణేష్, పెందుర్తి- అదీప్‌రాజ్) తిరిగి పోటీలో ఉంటారని అధిష్ఠానం సంకేతాలు ఇచ్చినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అయితే చివరి నిమిషంలో ఒకటి, రెండు మార్పులు జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని నేతలు పేర్కొం టున్నారు.

కలిసికట్టుగా...

... 5వ పేజీ తరువాయి

ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు బీజేపీ కూడా కొన్ని అసెంబ్లీ స్థానాలు కోరుతోంది. గతంలో 2014లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేసినప్పుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్‌రాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ పోటీ చేయడానికి ప్రచారం కూడా ప్రారంభించారు. ఉమ్మడి విశాఖలో బీజేపీకి ఏమైనా అసెంబ్లీ స్థానాలు ఇచ్చినట్టయితే అందులో మొదటిది విశాఖ ఉత్తర నియోజకవర్గమే అవుతుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. బీజేపీలో రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, నగర పార్టీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, బీజేపీ యువమోర్చా నాయకుడు సురేంద్రమోహన్ వంటివారు ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇంకా ఏమైనా అదనంగా అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తే వారిలో ఎవరికైనా ఛాన్స్ దక్కవచ్చు.

పసుపు రైతు ఖుషీ

... 5వ పేజీ తరువాయి

వస్తుండడంతో డిమాండ్ పెరిగి కిలోకు రూ.20 వరకు పెరిగింది.

మార్కెటింగ్ సదుపాయం అనివార్యం


ఏజెన్సీలో అధిక సంఖ్యలో గిరిజనులు పండించే పసుపునకు మన్యంలో మార్కెటింగ్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో ధర పెరుగుదల లేదా ధర స్థిరంగా ఉంటుందనే నమ్మకం లేకుండా పోతున్నదని గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి గిరిజనుల కోసం ఏర్పడిన గిరిజన సహకార సంస్థ(జీసీసీ), లేదా ట్రైఫెడ్ వంటి సంస్థలు గిరిజనుల నుంచి పసుపును కొనుగోలు చేసి దేశీయ మార్కెట్‌లో విక్రయించేలా చర్యలు చేపట్టాలి. కానీ అటువంటి చర్యలు చేపట్టేందుకు, గిరిజన రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అధికారులు మచ్చుకైనా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడితే పసుపు రైతులకు మరింత మేలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.



పెదబయలు మంగబంద గ్రామంలో పసుపు ఉడకబెడుతున్న గిరి రైతులు

నిండు పూత.. కనుల వింత!

ఆకర్షణీయంగా మామిడి పూత



మన్యంలో ప్రస్తుతం పూతతో మామిడి చెట్లు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడ మామిడి చెట్లను చూసినా నిండు పూతతో ఆకట్టుకునేలా చెట్లు ప్రకృతి ప్రియులకు కనువిందు చేస్తున్నాయి. అయితే ఈ దశలో వర్షం కురిస్తే ఆ పూత నిలబడుతుందని, మంచు కురిస్తే మాత్రం దెబ్బతింటుందని గిరి రైతులు చెబుతున్నారు.

-ఆంధ్రజ్యోతి/పాడేరు

ఆకులు రాలే వేళ.. ఆకట్టుకుంటి భళా!

ఆకులన్ని రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది! ప్రస్తుతం మన్యంలో చాలా చెట్లు ఇలాగే కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా విభిన్నమైన వర్ణాలతో పచ్చదనం ప్రకృతి ప్రియులను ఆకట్టుకుంటున్నది. పాడేరు-పెదబయలు ప్రధాన మార్గంలో మంగబంద కాఫీ తోటల వద్ద ఒక పైపు కాఫీ తోటలు, మరో వైపు పసుపు, ఎరుపు, పచ్చని ఆకులతో వేర్వేరు చెట్లు కలగలిసిన దృశ్యం అటుగా ప్రయాణించే వారికి విశేషంగా ఆకట్టుకుంటున్నది. దాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో ఇలా బంధించింది.



-పాడేరు/ఆంధ్రజ్యోతి

సంక్షిప్తంగా..

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

» **పాడేరు పీటీడీ డీసీటీఎం అప్పలనాయుడు**

పాడేరు రూరల్, మార్చి 9: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని పీటీడీ డిపోలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జోన్-1 బి.అప్పలనాయుడు తెలిపారు. కాంప్లెక్స్‌లో ప్రయాణికుకు సదుపాయాలను శనివారం ఆయన పరిశీలించారు. అలాగే శివరాత్రి స్పెషల్ బస్సు సర్వీసులు, జాతర సందర్భంగా పాడేరు, మత్స్యగుండంలో ఏర్పాటు చేసిన పీటీడీ సిబ్బంది క్యాంప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు అనువగా పాడేరు డిపోలో పార్శిల్ సర్వీస్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు పాడేరు నుంచి పార్శిల్స్ పంపించవచ్చని చెప్పారు. కార్గో సెక్షన్, పార్శిల్ సర్వీస్‌లను ప్రజలు, వ్యాపారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ తనిఖీల్లో డిపో మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్లు అప్పారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జపనీస్ భాష అభ్యాసానికి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్, మార్చి 9: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జపాన్ ఆస్పత్రులలో కేర్ టేకర్స్‌గా పనిచేసేందుకు అర్హులైన ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన యువతీ, యువకులకు జపనీస్ భాష నేర్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణను బెంగుళూరు నవిస్ హెచ్ఆర్ సెంటర్‌లో భోజన, వసతితో ఆరు నెలల పాటు అందిస్తారన్నారు. కోర్సు ఫీజు రూ.3 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. దానిలో రూ.25 వేలును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చెల్లిస్తుందని, మిగిలిన రూ.3 లక్షల 25 వేలు శిక్షణ పొందే అభ్యర్థులు మూడు దశలలో చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆరు నెలల శిక్షణ అనంతరం జపాన్‌లోని ఆస్పత్రులలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.1 లక్ష 10 వేలు నుంచి రూ.1 లక్ష 40 వేల వరకు జీతం ఇస్తారని ఆయన తెలిపారు. ఆసక్తి గల 32 ఏళ్ల లోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9949927899 ఫోన్ నంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

పూరిల్లు దగ్ధం.. లక్ష ఆస్తి నష్టం

కొయ్యూరు, మార్చి 9: కొమ్మిక పంచాయతీ శివారు పాత తుమ్మలబంద గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కర్రి రమణమ్మకు చెందిన ఇల్లు దగ్ధమై సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది. పూరిల్లు నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ప్రమాదం జరిగింది. గ్రామస్థులు అప్రమత్తమై మంటలను అదుపు చేయడంతో గ్రామానికి పెనుముప్పు తప్పింది. ఈ ఘటనలో గృహోపకరణాలు, తిండి గింజలు, బట్టలు సర్వస్వం కాలిబూడిద కావడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ సెగ్గే సూరిబాబు బాధితురాలిని పరామర్శించి తహసీల్దార్‌కు సమాచారం అందించారు. ఈ ఘటనలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఆదుకుని తగిన సహాయ సహకారాలు అందించాలని బాధితురాలు రమణమ్మ వేడుకుంది.

144 సెక్షన్ పక్కాగా అమలు చేయండి: సీఐ రమేష్

ముంచంగిపుట్టు, మార్చి 9: ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేయాలని జి.మాడుగుల సీఐ రమేష్ సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు జరిగేలా చూడాలని నిర్వాహకులకు, బందోబస్తు సిబ్బందికి సీఐ సూచించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో బయట వ్యక్తులు లోపలకు రాకుండా, అనవసరంగా లోపల వారు బయటకు వెళ్లకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర పాల్గొన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

డుంబ్రిగుడ, మార్చి 9: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జయ ఉమా తెలిపారు. ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రెండు ఎకరాల్లో కాఫీ తోటలు దగ్ధం

జి.మాడుగుల, మార్చి 9: మండలంలోని వంతల పంచాయతీ చింతగొంది గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఎకరాల్లో కాఫీ, మిరియాల తోటలు దగ్ధమయ్యాయి. చింతగొంది గ్రామానికి చెందిన వంతాల బాలక్రిష్ణ, వనగల శంఖందొరకు చెందిన తోటలు కాలిబూడిదయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఉప సర్పంచ్ తిరుపతమ్మ, టీడీపీ నాయకులు క్రిష్ణమూర్తి, కొండబాబు సంఘటన స్థలంలో బాధితులను పరామర్శించారు. బాధిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన చిన్నారి



తల్లి దగ్గర ఉన్న చిన్నారి

ముంచంగిపుట్టు, మార్చి 9: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో తప్పిపోయిన ఓ చిన్నారిని గంటల వ్యవధిలోనే ఎస్ఐ కె.రవీంద్ర తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. నాలుగేళ్ల ఓ చిన్నారి స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. తల్లిదండ్రుల పేర్లు అడిగితే చెప్పలేకపోయింది. దీంతో పాప ఫొటోను పలు వాట్సాప్ గ్రూపులలో ఎస్ఐ షేర్ చేశారు. చిన్నారి తమ వద్ద ఉందని, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను తెలియజేసి తీసుకువెళ్లవచ్చునని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇది హల్‌చల్ చేయడంతో అప్పటికే పాప కోసం సంతలో గాలిస్తున్న తల్లిదండ్రులకు విషయం తెలిసి స్టేషన్‌కు వెళ్లారు. అక్కడకు వెళ్లి జరిగిన విషయం, పూర్తి వివరాలు ఎస్ఐకు తెలియజేశారు. దీంతో పెద్దల సమక్షంలో చిన్నారిని పెదబయలు ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులకు ఎస్ఐ అప్పగించారు.